క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దిపాడు: మండల పరిధిలోని 132/33 గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ సబ్‌స్టేషన్‌లో ప్యానల్స్ మార్చేందుకు మండలంలోని పలు గ్రామాలకు గురు, శుక్రవారాలు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి శుక్రవారం రాత్రి 8 గంటల వరకు ట్రిపుల్ ఫేజ్ కరెంటు సరఫరాలో ఓవర్ లోడు వలన అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఆ సమయంలో ఒంగోలు నుంచి విద్యుత్ సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్నామని, ఈ క్రమంలో విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎరువులు, పురుగుమందుల శాంపిల్స్ సేకరణ


వెల్లంపల్లిలోని పురుగు మందుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ రమేష్

మద్దిపాడు: మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో మండల వ్యవసాయ శాఖాధికారి కె.రమేష్ బుధవారం శాంపిల్స్ సేకరించారు. నాణ్యత పరిశీలన కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. శాంపిల్స్ నాణ్యతలో ఏదైనా తేడా వస్తే షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలని తెలిపారు.

నాయుడుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి: మండలంలోని నాయుడుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నాయుడుపాలెం, పాటిమీదపాలెం, బండ్లమూడి, ఎర్రగుడిపాడు, తొర్రగుడిపాడు, చీమలమర్రి గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నందున ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

15 మందిపై బైండోవర్ కేసులు నమోదు

మద్దిపాడు: మండలంలో వినాయక నిమజ్జనోత్సవాలలో మద్యం సేవించి గొడవలు చేస్తున్న 15 మందిపై స్థానిక ఎస్సై శివరామయ్య బైండోవర్ కేసులు నమోదు చేశారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా మండలంలోని లింగంగుంట ఎస్సీకాలనీలో రెండు వర్గాలు గొడవపడటంతో 12 మందిపై కేసులు నమోదు చేశారు. అదే విధంగా మల్లవరంలో జరుగుతున్న నిమజ్జనోత్సవంలో మద్యం సేవించి కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్న ముగ్గురిపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకోకుంటే రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు.

శ్మశాన వాటికకు మరమ్మతులు చేపట్టాలి

ఒంగోలు సబర్బన్: స్థానిక విశ్వాస్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికకు మరమ్మతులు త్వరగా చేపట్టాలని వైఎస్సార్ సీపీకి చెందిన 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు, 21వ డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజు కోరారు. ఆ మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావును బుధవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఒంగోలు నగరంలోని 19, 30, 31 డివిజన్లకు చెందిన వారు ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు 31వ డివిజన్‌లోని విశ్వాస్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికలో చేసుకోవడం జరుగుతోందన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధి కోసం నగరపాలక సంస్థ రూ.19 లక్షలు కేటాయించి టెండర్లు కూడా పిలిచిందన్నారు. అయితే, కాంట్రాక్టర్ 2023 అక్టోబర్, నవంబర్ మాసాల్లో శ్మశాన వాటిక గేట్లు, కాంపౌండ్ వాల్‌తో పాటు లోపల జంగిల్ క్లియరెన్స్ కూడా చేపట్టారని కమిషనర్‌కు వివరించారు. అప్పటి నుంచి పనులు పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేశారని తెలిపారు. మూడు డివిజన్లకు చెందిన వారు ఎవరైనా మరణిస్తే విశ్వాస్‌నగర్ శ్మశాన వాటిక ఒక్కటే దిక్కని తెలిపారు. శ్మశాన వాటికలో పనులు పూర్తి కాకపోవడంతో మూడు డివిజన్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని కమిషనర్‌కు విన్నవించారు.










బై బై గణేశా..!

బొజ్జ గణపయ్యా.. వెళ్లిరావయ్యా... అంటూ భక్త జనం ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను బుధవారం ఐదో రోజు కావడంతో అధిక సంఖ్యలో నిమజ్జనం చేశారు. గణేష్ విగ్రహాల నిమజ్జనాలతో కొత్తపట్నం సముద్రతీరం కిక్కిరిసింది. ఒంగోలు నగరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీగా విగ్రహాలు, భక్తులు తరలివచ్చారు. ముందుగా విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో అట్టహాసంగా గణనాథుడిని ఊరేగించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా గులాములు చల్లుకుని డప్పులు, డీజేలకు నృత్యాలు చేశారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున యువత కదంతొక్కారు. మహిళలు సైతం పాల్గొని బై బై వినాయకా అంటూ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

- సాక్షి, ఒంగోలు









భార్యకు బదులు భర్త డ్యూటీ

- జీజీహెచ్‌లో డాక్టర్ బాషాపై దళిత నాయకులు ఫిర్యాదు


జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

ఒంగోలు టౌన్: స్థానిక జీజీహెచ్‌లో భార్య చేయాల్సిన డ్యూటీని భర్త చేస్తున్నాడని సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవికి దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్ర బుధవారం ఫిర్యాదు చేశారు. బుధవారం మధ్యాహ్నం విధులు నిర్వర్తించాల్సిన డాక్టర్ నజ్మా స్థానంలో అదే హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఆమె భర్త డాక్టర్ బాషా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. డాక్టర్ నజ్మా నగరంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తుంటే.. ఆమె భర్త బాషా ఇక్కడ ఆమె డ్యూటీ చేస్తున్నారని చెప్పారు. అగ్రకులాల దాడిలో గాయపడిన బల్లికురవ మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన గోగులమూడి నాగేంద్రమ్మను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకోలేదని, ఈ విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళితేగానీ అడ్మిట్ చేసుకోలేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదు రాసుకునేందుకు ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. అలాగే తాలూకా పోలీసుస్టేషన్లో నమోదైన కేసులో మక్కెన వరకుమార్‌పై డ్యూటీ డాక్టర్ సునీల్ గవాస్కర్ కర్కశంగా ప్రవర్తించాడని, బాధితుడి తల్లిని, చెల్లిని క్యాజువాలిటీ నుంచి అర్ధరాత్రి బయటకు గెంటివేశాడని తెలిపారు. ఎస్సీల పట్ల జీజీహెచ్‌లో వివక్ష కొనసాగుతోందని విమర్శించారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కొమ్ము సుజన్, మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య ఉన్నారు.

ఉత్సాహంగా జేసీస్ వారోత్సవాలు


భూమిని కాపాడుకుందాం అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జేసీస్ ప్రతినిధులు

ఒంగోలు: స్థానిక కాపు కళ్యాణ మండపంలో జరుగుతున్న జేసీస్ వారోత్సవాల్లో బుధవారం మూడో రోజు ఉత్సాహం వెల్లివిరిసింది. అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే నినాదంతో అన్నం వృథా చేయకుండా తినాలంటూ హాస్టల్ విద్యార్థులకు తొలుత అవగాహన కలిగించారు. ప్రతి మెతుకు వెనుక రైతు శ్రమ ఉందని విద్యార్థులకు తెలియజెప్పే విధంగా కార్యక్రమం జరిగింది. అనంతరం పీవీఆర్ బాలుర పాఠశాలలో అత్యవసర పరిస్థితుల్లో గుండెనొప్పి వచ్చినప్పుడు ఎలాంటి వైద్యం చేయాలో రెడ్‌క్రాస్ డాక్టర్ కృష్ణారావు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకోవడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడం ఎలా అనే విషయంపై రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మనభూమి మన బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా నో ప్లాస్టిక్ అనే నినాదంతో యువతకు చైతన్యం కలిగించేలా త్రీ కే రన్‌ను గాంధీ పార్క్ నుంచి నిర్వహించారు. ఈ ర్యాలీని జూనియర్ చాంబర్ జాతీయ పూర్వాధ్యక్షుడు పీపీపీ నయనాల రామకృష్ణ, జూనియర్ చాంబర్ పూర్వ ధ్యక్షుడు వీవీ రమణ జెండా ఊపి ప్రారంభించారు. అంజయ్య రోడ్డు, బైపాస్ రోడ్డు, మంగమూరు రోడ్డు మీదుగా తిరిగి గాంధీ పార్క్ దగ్గర ముగించారు. జేపీ వీక్ చైర్మన్ పి.శబరీనాయర్, కార్యదర్శులు సాత్విక్ రాజు, బి.శ్రీకాంత్, జూనియర్ చాంబర్ అధ్యక్షుడు కె.వరుణ్‌కుమార్, జేసీ వీక్ కో ఆర్డినేటర్స్ వి.రవీంద్ర, సోమినేని సురేష్, జేసీ వీక్ కో చైర్మన్లు పి.శివకోటిరెడ్డి, గాంధవల్ల బాలకృష్ణ, పూర్వ అధ్యక్షులు అద్దంకి శ్రీనివాసులు, శిబి మైకేల్, ప్రతిభ సంస్థల డైరెక్టర్ నల్లూరి జయప్రకాష్ సారథ్యం వహించారు. అనంతరం కాపు కళ్యాణ మండపంలో పూర్వ అధ్యక్షుడు రిటైర్డు డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌డీ ఇస్మాయిల్, ఆత్మకూరి బ్రహ్మయ్య నేతృత్వంలో విద్యార్థులకు అంత్యాక్షరి, చదరంగం, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు.

విద్యార్థి దశ నుంచే హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి

ఒంగోలు సబర్బన్: విద్యార్థి దశ నుంచే హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని మద్దిరాలపాడు శ్రీ సూర్య విద్యానికేతన్ కరస్పాండెంట్ రామళ్ల వెంకట రామిరెడ్డి అన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థల సహకారంతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సూర్య విద్యానికేతన్ జూనియర్ కాలేజీ, హైస్కూలు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్, లక్ష్మీరెడ్డి, ఔట్‌రీచ్ వర్కర్లు మల్లేశ్వరి, కృష్ణవేణి, పీఈలు దివ్య, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ పురం హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి


బీసీ సంక్షేమ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఒంగోలు టౌన్: నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న సీఎస్ పురం బీసీ హాస్టల్ వార్డెన్ ఏవీ చెన్నయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బీసీ సంక్షేమ అధికారికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం మెనూ ప్రకారం విద్యార్థులకు పెట్టాల్సిన ఇడ్లీ పెట్టకుండా పచ్చడి అన్నం పెట్టారని తెలిపారు. అంతేగాకుండా హాస్టల్ పరసరాల్లోని విద్యార్థులను చేర్చుకున్నారని, వారంతా రాత్రులు హాస్టల్లో ఉండకుండా ఇంటికి వెళ్లిపోతున్నారని తమ పరిశీలనలో తెలిసిందన్నారు. ఏబీసీడబ్ల్యూ నిర్లక్ష్యం వలన వార్డెన్ సక్రమంగా విధులకు కూడా హాజరుకాకుండా హాస్టల్‌ను గాలికి వదిలిపెట్టాడని ఆరోపించారు. అంతేగాకుండా హాస్టల్లో పనిచేస్తున్న ఒక మహిళా వర్కర్‌ను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని, మహిళా వర్కర్లకు రక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బండి వీరాస్వామి, విజయ్ పాల్గొన్నారు.

సూర్యనగర్ లడ్డూ రూ.19 వేలు


వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న శ్రీనివాసరావు

చీమకుర్తి: వినాయకచవితి సందర్భంగా స్థానిక సూర్యనగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం చేతిలో ఉంచి పూజలందుకున్న లడ్డూను స్థానికుడు గోసి శ్రీనివాసరావు బుధవారం నిర్వహించిన వేలంపాటలో రూ.19 వేలకు పాడుకున్నారు. విగ్రహాన్ని వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.

14 నుంచి దివ్యాంగుల క్రికెట్ పోటీలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు

చీమకుర్తి: ఇంటర్ జోన్ దివ్యాంగుల క్రికెట్ పోటీలను ఈ నెల 14, 15 తేదీల్లో ఒంగోలులోని శర్మ కాలేజీలో నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రా, ప్రకాశం జట్లకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు బుధవారం తెలిపారు. డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్ర, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ప్రకాశం జట్లు సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయా అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు కసుకుర్తి శివప్రసాద్, వేల్పుల విజయకుమార్ వెల్లడించారు. దానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం శర్మ కాలేజీ క్రీడా ప్రాంగణంలో ఆవిష్కరించారు. క్రికెట్ పోటీల అనంతరం ఉదయ్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో మన రాష్ట్రం తరఫున పాల్గొనే జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడంతో పాటు జాతీయ స్థాయి పోటీల్లో ఎంపికకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 60 మంది దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు హాజరుకావచ్చని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో దివ్యాంగుల క్రికెట్‌ను సాధారణ క్రికెట్‌కు తీసిపోకుండా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నం చేయనున్నట్లు వారు తెలిపారు.

పచ్చమూకల పిచ్చి చేష్టలు

- వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ కండువా కప్పి చేతిలో టీడీపీ జెండా పెట్టి పైశాచిక ఆనందం


టీడీపీ కండువా, జెండాతో వైఎస్సార్ విగ్రహం

సాక్షి టాస్క్‌ఫోర్స్: పచ్చమూకల పిచ్చి చేష్టలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. ఇప్పటికే అనేకచోట్ల వైఎస్సార్ విగ్రహాలు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాల ధ్వంసం చేసిన తెలుగు తమ్ముళ్లు.. తాజాగా మద్దిపాడు మండలంలోని లింగంగుంట గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి టీడీపీ కండువా కప్పి చేతిలో టీడీపీ జెండా పెట్టి పైశాచిక ఆనందం పొందారు. గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు దీనిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికార అహంకారంతో టీడీపీ శ్రేణులు వ్యవహరిస్తున్న తీరును గ్రామస్తులు అసహ్యించుకుంటున్నారు. నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికులను ఆదుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

చీమకుర్తి: విజయవాడలోని వరద బాధితులకు సహాయం చేయడానికి వెళ్లిన చీమకుర్తి మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులను వెంటనే విడుదల చేయాలని చీమకుర్తిలోని మిగిలిన కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. వరద బాధితులకు సహాయం చేయడానికి విజయవాడ వెళ్లి అనారోగ్యం పాలైన పారిశుధ్య కార్మికులకు మద్దతుగా బుధవారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద మిగిలిన కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సహాయం చేసేందుకు వెళ్లిన వారికి సకాలంలో ఆహారం, మంచినీరు అందక అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజుకు వినతి పత్రం అందించారు. నిరసనకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

వైద్యశాలల్లో సిబ్బందిని నియమించాలని వినతి

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని వైద్యశాలల్లో తగినంత మంది వైద్య సిబ్బందిని నియమించి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి బి.విజయరావు కోరారు. ఆ మేరకు విజయవాడలో బుధవారం వైద్యారోగ్య శాఖామంత్రి వై.సత్యకుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సరైన సిబ్బంది లేక నార్మల్ డెలివరీ జరగాల్సిన చోట ఆపరేషన్ల వరకు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. ఆధునిక పరికరాలు సమకూర్చి వైద్య రంగంలో మంచి సేవ చేసి మంచి పేరు తీసుకువచ్చే విధంగా ప్రయత్నించాలని కోరారు. జిల్లా పర్యటనకు రావాలని కోరారు.

బీసీ కులగణనపై కేంద్రం మొండివైఖరి విడనాడాలి


మిరియం శ్రీనివాసులు

ఒంగోలు: బీసీ కులగణనపై కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు అన్నారు. బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కులగణన జరగాలని డిమాండ్ చేసిందని, కానీ, ఇప్పుడు పది సంవత్సరాల నుంచి కేంద్రంలో అధికారంలో ఉండి కులగణనపై స్పందించకుండా కాలయాపన చేయడం దారుణమని అన్నారు. కులగణన జరిగితే బీసీలు ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా ఎంతో అభివృద్ధి చెందుతారని, అలాగే చట్ట సభలలో అన్ని బీసీ కులాల వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కులగణన జరగాలని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బీసీ సంఘాలు, కుల సంఘాలతో కులగణన సాధనకు ఐక్య ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు శ్రీనివాసులు పేర్కొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగును అప్పగించిన పోలీసులు


బాధితుడికి బ్యాగు అప్పగిస్తున్న టూటౌన్ సీఐ శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: పోగొట్టుకున్న బ్యాగును బాధితుడికి అప్పగించిన ఘటన బుధవారం ఒంగోలు నగరంలో జరిగింది. చేకూరపాడు గ్రామానికి చెందిన దారా కోటేశ్వరరావు వ్యక్తిగత పనులపై టీవీఎస్ మోపెడ్ వాహనంపై ఒంగోలు వచ్చాడు. బాపూజీ కాంప్లెక్స్ వద్దకు రాగానే అతడి వద్ద ఉన్న బ్యాగు పొరపాటున జారి పడిపోయింది. ఈ విషయాన్ని గమనించకుండా కోటేశ్వరరావు వెళ్లిపోయాడు. అదేదారిలో వెళ్తున్న ఒంగోలు కమ్మపాలేనికి చెందిన దుర్గామల్లేశ్వరరావుకు ఆ బ్యాగు దొరికింది. దాన్ని తీసుకెళ్లి టూటౌన్ పోలీసుస్టేషన్లో అప్పగించాడు. టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు సిబ్బంది ద్వారా బ్యాగు పోగొట్టుకున్న కోటేశ్వరరావును గుర్తించారు. అతడి సమక్షంలో బ్యాగు తెరిచి చూస్తే అందులో బంగారు చెయిన్ ఉంది. బ్యాగును బాధితుడికి అప్పగించారు.